క్లుప్తంగా

పారిశుధ్య సిబ్బందికి బియ్యం అందజేత



బియ్యం పంపిణీ చేస్తున్న జానకీరామ్, షారోన్‌రాజు తదితరులు

ఏయూక్యాంపస్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ రెల్ల జానకీరామ్ ఆధ్వర్యంలో శనివారం ఏయూలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పారిశుధ్య సిబ్బందికి బియ్యం, పండ్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు, పార్టీ నాయకుడు మార్కండేయులు, విద్యార్థి విభాగం నాయకులు డాక్టర్ బి.మోహన్, డాక్టర్ ఎం.కల్యాణ్, కల్యాణ్ రాజ్, జగన్మోహన్, మాధవరెడ్డి, నాగరాజు, హేమంత్, స్వామి, శ్యామ్, రసూల్, షణ్ముఖ్, సంజయ్, జయవర్ధన్, మణి, హరి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్ నగదు అందిస్తున్న కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్ల లబ్ధిదారులకు శనివారం నగదు పంపిణీ చేశారు. వార్డు పరిధిలో కొత్తగా అర్హులైన 31 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. వీరికి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చేతుల మీదుగా నగదు అందజేశారు. దివ్యాంగులైన వారి ఇళ్లకు స్వయంగా కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి వెళ్లి నగదు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లక్ష్మి మాట్లాడుతూ అర్హులందరికీ పూర్తిస్థాయిలో సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

ఆరిలోవలో భారీ వర్షం



పెదగదిలి కూడలిలో చేరిన వర్షం నీరు

ఆరిలోవ: ఆరిలోవలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. హనుమంతువాక, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల్లో కొండవాలు నుంచి వచ్చిన వరద నీటితో బీఆర్‌టీఎస్‌పై ఎక్కవ బడితే అక్కడ నీరు నిలిచిపోయింది. పెదగదిలి కూడలిలో పల్లం కావడంతో కొండవాలు నుంచి వచ్చిన వరద నీటితో గంటకు పైగా నీరు నిలిచిపోయింది. దీంతో ఆ నీటిలో వాహనచోదకులు ప్రయాణించడానికి ఇబ్బందిపడ్డారు. వీధుల్లో కాలువలు, గెడ్డలు సైతం పైనుంచి వచ్చిన వరద నీటితో పొంగిపోయాయి. కొద్ది రోజులుగా ఎండలతో హడలెత్తించిన వాతావరణం ఈ వర్షంతో చల్లబడింది.

ర్యాష్ డ్రైవింగ్‌తో వివాదం

తగరపువలస: భీమిలి రోడ్డులోని విశాఖపట్నం కో ఆపరేటివ్ సహకార బ్యాంకు బ్రాంచి కూడలిలో శనివారం సాయంత్రం ర్యాష్ డ్రైవింగ్ ఇరువర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. బంగ్లామెట్టకు చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ భీమిలికి చెందిన ఒక యువకుడిని ఢీకొట్టాడు. దీంతో ఈ ప్రమాదంలో గాయపడిన యువకుడు భీమిలి నుంచి తన స్నేహితులను పిలిపించగా... వచ్చిన వారు బంగ్లామెట్ట యువకునిపై దాడికి పాల్పడ్డారు. వెంటనే బంగ్లామెట్ట యువకులు కూడా అక్కడకు చేరుకోగా ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగి ఎక్కువ సంఖ్యలో జనం పోగయ్యారు. స్థానికులు ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వెనక్కు తగ్గలేదు. ఈ సందర్భంగా తగరపువలస – భీమిలి రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. చివరకు ఇరువర్గాలను భీమిలి పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి

మేయర్ హరి వెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎంపీ, నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్ని వార్డుల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న మేయర్, ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర ప్రజల కోసం విమ్స్‌ను వైఎస్సార్ అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఐదు లైన్ల బీఆర్‌టీఎస్ రోడ్డు, హెల్త్‌సిటీ, ఏయూలో పలు అభివృద్ధి పనులు చేపట్టి ఇక్కడ ప్రజలకు సేవలు అందించారన్నారు.

● జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి కార్పొరేటర్ స్వాతి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మోహన్‌రెడ్డి, అప్పారావు, కళావతి, భీమారావు, పిట్టారెడ్డి పాల్గొన్నారు.

● 10వ వార్డులో మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు శాంతినగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. జనపాన రజినీ, ఒమ్మి శ్రీను, చింతా శ్రీను, బీజపు పైడిరాజు, కృష్ణ పాల్గొన్నారు.

● 11వ వార్డు బాలాజీనగర్‌లో వైఎస్సార్ చిత్రపటానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి నివాళులర్పించారు. నాయకులు గొలగాని శ్రీనివాస్, కె.మోహన్‌రావు, బోని శ్రీను, సూరిబాబు పాల్గొన్నారు.

● 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేదలకు బియ్యం, పళ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బాబిరెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కర శేఖర్, శ్రీనిసరావు, మోహన్, ముద్దాడ పాపారావు పాల్గొన్నారు.

● 13వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి కార్పొరేటర్ కెల్ల సునీత, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ బాలుర గృహంలో బాలురకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. నల్ల కృపాజ్యోతి, బాబిరెడ్డి, కెల్ల సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, దుర్గారావు, పోలరావు, గోవింద్, బాబూరావు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో అమరుడు

ఏయూక్యాంపస్: ప్రజల హృదయాల్లో అమరుడిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిరకాలం నిలిచిపోతారని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూలోని వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నేడు ఎందరినో ఉన్నత స్థాయిలో నిలిపిందన్నారు. దీనికి మరింత శక్తినిచ్చేలా ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు అమలు చేస్తున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి కాంస్య విగ్రహాన్ని ఏయూలో నెలకొల్పామన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, డాక్టర్ బి.వి.రమణారెడ్డి, త్రినాథరెడ్డి, బి.రామచంద్ర, ఎం.రాంబాబు, ఎం.లక్ష్మణరెడ్డి, బి.మంగరాజు, అప్పలనాయుడు, పి.కనకరాజు, పోలారావు, శ్రీనివాస్, జి.వి.రమణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తులు...

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ రాజశేఖర రెడ్డి పరిపాలన సాగించారని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 20వ వార్డులో కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి పారిశుధ్య సిబ్బందికి నూతన వస్త్రాలను శనివారం బహూకరించారు. రాచకొండ చారిటీస్ నిర్వాహకులు రాచకొండ దశరథరామయ్య 55 మంది పారిశుధ్య సిబ్బందికి దుస్తులు అందించారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బాబి రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, ముచ్చల సురేష్ పాల్గొన్నారు.

● పెదవాల్తేరులో వైఎస్సార్ అభిమానులు, నాయకులు ఎంపీ ఎంవీవీ చేతుల మీదుగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. మద్ది పోలిరెడ్డి, బి.కుమార్ రెడ్డి, పండరీబాయి, రమాదేవి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో ఎంపీ, తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం వార్డులో కొత్తగా మంజూరైన 12 మందికి పింఛన్ల నగదు అందజేశారు.

● 23వ వార్డులో కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి ఆధ్వర్యంలో చైతన్యనగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేదలకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు.

● 15వ వార్డులో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు ఆధ్వర్యంలో ఎంపీ ఎంవీవీ పేదలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

● 15వ వార్డులో మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నడింపల్లి క్రిష్ణంరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, బాబిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు

ఎంవీపీ కాలనీ: సామాన్యుల గుండెల్లో స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎప్పటికీ నిలిచే ఉంటారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. లాసన్స్ బే కాలనీలోని ఆయన కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్ పాటుపడ్డారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

● 19వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ ఎంవీవీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. సూరాడ దాసు పాల్గొన్నారు.

● 17వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి కార్పొరేటర్ గేదెల లావణ్య, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులు, వికలాంగులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో వేమన మందిరం వద్ద పారిశుధ్య కార్మికులకు చీరలను విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పంపిణీ చేశారు.



13వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ సునీత



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య



జీవీఎంసీ 10వ వార్డులో చీరలు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి, తదితరులు



ఏయూలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి తదితరులు



పారిశుధ్య కార్మికులకు చీరలు అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తదితరులు



11వ వార్డులో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, శ్రీనివాస్ తదితరులు



పెదవాల్తేర్‌లో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తదితరులు

నవోదయ విద్యాలయంలో వసతుల పరిశీలన

కొమ్మాది: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాన్ని, వసతులను పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. బాలలు క్రమశిక్షణతో ఉండాలని, అనుమతి లేకుండా ఇతరులను ఎట్టి పరిస్థితుల్లో విద్యాలయంలోకి రానివ్వద్దని ప్రిన్సిపల్ కె.సంజయ్‌కు సూచించారు. నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరపాలని, విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సంగీతం, పాటలు మొదలైన వాటిలో వారు ఆసక్తి చూపేవిధంగా, వివిధ రంగాల్లో రాణించేలా తర్ఫీదునివ్వాలన్నారు. నవోదయ విద్యాలయాల్లో చదువుకున్న అనేక మంది కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అధికారులుగా ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కమిషన్ సభ్యులు బొండు సీతారాములు, రమేష్ పాల్గొన్నారు.

అష్టలక్ష్మీదేవి సహిత మహాలక్ష్మికి కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మీదేవి సహిత మహాలక్ష్మి



అష్టలక్ష్మీదేవి సహిత మహాలక్ష్మి కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం శంకరమఠంలో అష్టలక్ష్మీదేవి సహిత మహాలక్ష్మి అమ్మవారి కుంకుమార్చన నిర్వహించారు. శ్రీరామ్ రామ్ గురూజీ పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ కొఠారి సునీత మాట్లాడుతూ తాళ్లపాక స్వామీజీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రామ్ రామ్ గురూజీ మాట్లాడుతూ శ్రావణ మాసంలో ఇటువంటి పూజలు చేయడం వల్ల జనులందరూ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ శ్రావణ మాసంలో ఇటువంటి పూజలు చేయాలన్నారు. కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తుల నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా నిర్వహించిన అన్నమాచార్య ట్రస్టు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుమారు 500 మంది మహిళలు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయికి తెలుగు సినిమా

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో 'తెలుగు సినిమా పోకడలు' అనే అంశంపై సీనియర్ సినిమాటోగ్రాఫర్, కళ్లు సినిమా డైరెక్టర్ ఎం.వి.రఘుతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లు సినిమా విశాఖలోనే నిర్మించామని, 30 ఏళ్లు గడిచినా ఆ చిత్రం గురించి ఇంకా మాట్లాడుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు సినిమా ప్రపంచ స్థాయికి ఎదిగిన తీరును వివరిస్తూ ప్రతి 20 ఏళ్లకు సినిమా ప్రేక్షకుల అభిరుచులు, వేష భాషలు మారుతుంటాయన్నారు. వాటిని పసిగట్టి తీసిన సినిమాలే బాక్సాఫీస్‌లో నిలబడుతున్నాయని చెప్పారు. ఇటీవల యువత ముందుకొచ్చి సినిమాలు తీయడం, అవి ప్రేక్షకుల ఆదరణ పొందడం శుభ పరిణామమన్నారు. ఇటీవల అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు, ఆర్‌ఆర్‌ఆర్ పాటకు ఆస్కార్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. విశాఖ జిల్లా సినిమా అభివృద్ధికి అనువైనదని, ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఎం.వి.రఘు సుమారు 70 సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసి కళ్లు సినిమాతో ప్రాచుర్యం పొందారన్నారు. అనంతరం రఘును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, హస్సన్, ఛాట్ల బాబూరావు, బి.చిన్నారావు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



సినిమాటోగ్రాఫర్ రఘును సత్కరిస్తున్న నరవ ప్రకాశరావు

వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు

ఎంవీపీ కాలనీ: డిసెంబర్‌లో నిర్వహించనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌కు సంబంధించిన పోస్టర్‌ను మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు నగరంలోని ఓ ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ సుంకరి రవీంద్ర మాట్లాడుతూ డిసెంబర్ 23, 24న ఈ కన్వెన్షన్ జరగనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం వేదికగా సమావేశాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఉప్పలపాటి శుభ, ద్వారకానాథ్, రాంజీ, రఘు, మధుసూదన్ కృష్ణంరాజు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని ఆందోళన

తగరపువలస: పెరిగిన ధరలు తగ్గించాలని కోరుతూ భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు బొగ్గురోడ్డు సచివాలయం ముందు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కోరారు. జీఎస్‌టీ భారంతో మధ్య తరగతి ప్రజల జీవనం ప్రమాదకరంగా మారిందన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భర్తీ చేయాలని కోరారు. రవ్వ నరసింగరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన వెంకట నరసింహారావు శనివారం లక్ష 116 రూపాయిల విరాళం అందజేశారు. దాత దాతకు దేవస్థానం తరఫున అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేసి స్వామి దర్శనం కల్పించారు.



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

జోరుగా బ్రిడ్జి విస్తరణ పనులు



సూర్యతేజానగర్, పార్వతీనగర్‌ల మధ్య బ్రిడ్జి విస్తరణ పనులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం నుంచి చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయం మీదుగా బీఆర్‌టీఎస్‌కు వెళ్లే దారిలో బ్రిడ్జి విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. సూర్యతేజానగర్, పార్వతీనగర్‌ల మధ్యలో ఉన్న ఈ బ్రిడ్జిని జీవీఎంసీ వెడల్పు చేస్తోంది. ప్రస్తుతం ఈ పనులు జరుగుతుండటంతో పార్వతీనగర్ మీదుగా చినగదిలి వెళ్లే రహదారికి కొద్ది రోజులు బ్రేక్ పడింది. చినగదిలి సాయిబాబా గుడి నుంచి సూర్యతేజానగర్ వరకు ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులతో డబుల్ రోడ్డు నిర్మించిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి శ్రీకాంత్‌నగర్, పార్వతీనగర్ వెళ్లడానికి ఇరుకు బ్రిడ్జిని ప్రస్తుతం విస్తరిస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా బ్రిడ్జికి ఇరుపక్కలా తవ్వేశారు. బ్రిడ్జి ముందు రోడ్డును తవ్వి గెడ్డ నుంచి వచ్చిన మురుగు నీటిని పక్క నుంచి పోవడానికి తాత్కాలిక మార్గం చూపారు. దీంతో ఈ రహదారి పూర్తిగా మూతపడింది. ఈ పనులు పూర్తయ్యేంత వరకు ఈ మార్గం మూసి ఉంటుందని, అటుగా ప్రయాణించే వాహన చోదకులు బాలాజీనగర్, తోటగరువు మీదుగా బీఆర్‌టీఎస్‌కు వెళ్లాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు సూచిస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ బ్రిడ్జి పనులు తొందరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



ద్విచక్ర వాహనాన్ని పరిశీలిస్తున్న ద్వారకా ఎస్‌ఐ అప్పలరాజు

సీతమ్మధార: వాహన చోదకులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని ద్వారకా జోన్ ఎస్ఐ అప్పలరాజు అన్నారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి రామాటాకీస్ సమీపంలో శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా, హెల్మెట్ ధరించేలా వాహన చోదకుకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్ బోర్డులపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల పత్రాలను పరిశీలించి, అవి లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడి వద్ద లైసెన్స్, సీబుక్, పొల్యూషన్ పత్రాలు కచ్చితంగా ఉండాలని, రవాణా శాఖ ఇచ్చిన నంబర్ ప్లేట్ మాత్రం ఉపయోగించాలని సూచించారు. సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు.